పొగమంచు

సీరియల్

మద్దా సురేష్

(పదకొండవ భాగము)

ఎలాగో అనగలిగాడు చివరికి. "ఎస్ డార్లింగ్. హి ఈజ్ డెడ్."

"అతను నా తండ్రి కాదు!"

భయంకరమైన నిశ్శబ్దంలో కూలిపోయాడు రాణా.

"నాకు చెప్పాడు రాణా! నేను ఆయన్ని చంపబోయే ముందు. నేను ఆయనకి పుట్టలేదట" బిగ్గరగా ఏడ్వసాగింది లూసీ వణుకుతున్న శరీరంతో, "ఆయన పోయినందుకు నాకు జాలిమాత్రం ఉంది అంతే. కాని ఒక తండ్రి మరణించినపుడు కూతురికి కలిగే దుఃఖం నాలో కలగడంలేదు. ఏమిటి రాణా కారణం? నేను యింకా.... పిచ్చిదాన్నా?" ఆమె తటాలున వెనక్కి జరిగి, రాణా ముఖంలోకి పరీక్షగా చూసింది "టెల్ మీ రాణా! యామ్ ఐ స్టిల్ ఇన్ సేన్?"

"నో డార్లింగ్...." ఆమె ముఖాన్ని రెండు చేతుల్లో తీసుకుంటూ అన్నాడు రాణా. "ఆ దుఃఖపు కెరటం నిన్ను తర్వాత తాకుతుంది. చాల దురదృష్టకర సంఘటనల పరంపర వల్ల నువ్వు అల్సిపోయావ్....నీ మెదడు నిన్ను రక్షిస్తోంది....త్వరలో పితృవియోగపు బాధ నీలో ప్రవేశిస్తుంది.... దానికోసం వెతకొద్దు."

గట్టు తెగిన ప్రవాహంలా, లూసీ వెక్కి వెక్కి ఏడుస్తూ, తటాలున అతని కౌగిట్లో తలదాచుకుంది.

వెక్కిళ్ళతో, ఆమె సున్నితమైన దేహం బలహీనంగా ఎగిసెగిసి పడుతోంది.

"ఐ లవ్డ్ హిమ్....ఆయన్ను ఎంతగానో ప్రేమించాను.... నేను చేసిన ఘాతుకాన్ని తల్చుకుంటూ, ఏమీ

ఎరుగనిదానిలా ఎలా జీవించగలను రాణా? ఒక తండ్రిని హత్య చేసిన...."

"అది నీ తప్పు కాదు లూసీ .... యువర్ నాట్ రెస్పాన్సిబుల్!"

"అండ్ యూ రాణా! నిన్ను కూడా హతమార్చడానికి ప్రయత్నించాను. నన్ను క్షమించగలవా?"

"ఐ టోల్డ్ యు హనీ! దానికి బాధ్యురాలవు నువ్వు కాదు. విష మేఘం!"

తేలగా అంది లూసీ "యామై రియల్లీ ఆల్ రైట్ రాణా? యామై రియల్లీ బెటర్?"

"ఎస్, ఆఫ్ కోర్స్ యు ఆర్! నీకు ప్రమాదం పూర్తిగా తప్పిపోయింది. యిక నువ్వు గతాన్ని మర్చిపోడంలో నేను పూర్తిగా సాయపడతాను. నాకు నమ్మకం ఉంది లూసీ! త్వరలో అన్నీ మరువగల్గుతావ్.... యిద్దరం హాయిగా జీవిస్తాం....జీవితమంతా."

తర్వాత ప్రశాంతంగా యిద్దరూ చాలా సేపు కబుర్లు చెప్పుకుంటూ ఉండిపోయారు. రాణా మాటలు లూసీకి కొత్త ధైర్యాన్నిచ్చాయి....ఓదార్పునిచ్చాయి....ఆశలు చిగురింపచేసాయి....

చివరికి, అడిగింది లూసీ. "యిప్పుడేం జరుగుతోంది రాణా?"

"నన్ను మళ్ళీ వెనక్కి పంపిస్తున్నారు, విష మేఘం నుండి మైక్రోప్లాస్మాను సేకరించడానికి."

ఆమె ముఖంలో రంగులు మారాయ్. "ఎందుకు? నువ్వే ఎందుకు వెళ్ళాలి? జులేఖా చెప్పింది ఉన్మాదానికి కారణభూతమైన మైక్రోప్లాస్మా గురించి. కాని నిన్ను ఎవరు పంపుతున్నారక్కడికి? నువ్వే ఎందుకు వెళ్ళాలి?"

ళ్ళ పంగా రాణా అంతా చెప్పాడు, జరిగిన సంఘ టనల గురించీ, తనకు వ్యాధిసోకే ప్రమాదం లేకపోవడం గురించీ, అలాగే ఆమెక్కూడా ఆ ప్రమాదం లేదని చెబుతూ.

రాణా అంతా చెప్పాడు ఆమెకు. వ్యాధి గురించి, వ్యాధి పుట్టుపూర్వోత్తరాల గురించీ....

ఉదయపుటనుభవం గురించి కొంతమాత్రమే చెప్పాడు రాణా, ఆమెలో భయాన్ని రేకెత్తించడం యిష్టం లేక.

ఆందోళనగా, ఆ విషయాలన్నీ విన్నది లూసీ, గుండెల్లో గూడు కట్టుకున్న భయంతో, ఒకవైపు నమ్మ లేక అపనమ్మకంతో.

వారి సంభాషణకు అంతరాయం కలిగించింది జులేఖా, అలసటను దాచుకుంటూ చిరునవ్వుతో ప్రవేశిస్తూ—

"ఆమెపై మరికొన్ని పరీక్షలు జరపాలి రాణా! విశ్రాంతికూడా ఆమెకు చాలా అవసరం.... ఇన్‌స్పెక్టర్ మీతో ఏదో చెప్పాలట."

అతి త్వరలో తిరిగి వచ్చేస్తానని ప్రమాణం చేస్తూ రాణా లూసీనీ ముద్దాడాడు.

తిరిగి మృత్యుముఖంలాంటి విషమేఘంలో ప్రవేశించ వద్దనీ, తనప్రక్కనే వుండిపొమ్మనీ, తను పూర్తిగా కోలు కునేదాకా వుండి, దగ్గరుండి తీసుకెళ్ళమనీ, చెప్పాలని లూసీ యెంతో ఆరాటపడింది.

కాని తన ప్రయత్నం నిరర్థకం అని ఆమె గ్రహిం చింది. లక్షలాది ప్రజల ప్రాణాలు, అతనిపై ఆధారపడి వున్నాయని యిప్పుడామెకు తెలుసు.

సైన్సు యెంత అభివృద్ధి చెందినప్పటికీ, ప్రపంచం యింకా మనిషి పై ఆధారపడి వుందని తెల్సు .... కేవలం ఒక్క మనిషి పై—

ఇన్ స్పెక్టర్ రైనా, బయట కారిడార్ లో యెదురు చూస్తున్నాడు. "నిన్ను తిరిగి విష మేఘంలో ప్రవేశించమని వాళ్ళు కోరుతున్నారు" చెప్పాడు రాణాకు. "కాల్షియం క్లోరైడ్ యింకా చల్లుతున్నారు, వందలాది టన్నులు....తగ్గినట్లు కనిపిస్తోందట. విష మేఘం బాగా విడిపోగానే, లోపల ప్రవేశించడానికి నువ్వు అక్కడ వుండాలట."

తలూపాడు రాణా.

"ఆల్ రైట్, లెటస్ గో."

హెలికాప్టర్—నాసిక్ పట్టణం పొలిమేరల్లో వారిని దింపింది. ఎదురుగా జీపులు, ట్రక్కులు ఆగివున్నాయి. వాటివద్ద నిలబడి వున్నారు ప్రొఫెసర్ అశ్వత్థామ, ఆర్మీ అండర్ సెక్రటరీ రణధవే, లెఫ్టినెంట్ జనరల్ ప్రచండ సేన్ లు.

దూరంగా సాయంకాలపు ఆకాశంలో ఓ తేలికరకం విమానం శబ్దం చేసుకుంటూ క్రిందుగా ఎగురుతూ పంట పొలాలమీద క్రిమిసంహారక మందు జల్లినట్లు, కాల్షియం క్లోరైడ్ ని విష మేఘంమీద చల్లుతోంది....

రణధవే ముందుకు వచ్చాడు చేయిచాస్తూ, "వాలియంట్ ఎఫర్టు దిస్ మోర్నింగ్ మిస్టర్ రాణా!"అన్నాడు రాణాతో కరచాలనం చేస్తూ.

విషాదంగా నవ్వాడు రాణా. "సారీ! పంజరంలో పక్షిని తేలేకపోయాను."

"నథింగ్ టు వర్రీ—బెటర్ లక్ నెక్స్ట్ టైమ్!"

అంతలో ప్రచండ సేన్ వారిద్దరిమధ్యకు వచ్చి, ముక్కు-సూటిగా అన్నాడు. "మీరు మళ్ళీ ప్రయత్నించాలి మిస్టర్ రాణా! మీరు ఆ శాంపిల్ పట్టుకురావడం చాల చాలా ముఖ్యం."

"ఎస్ రాణా!" తలూపాడు అండర్ సెక్రటరీ, "నిరాశా నిస్పృహాలు భరించలేక, సాహసించి యిద్దరు వలంటీర్లను విషమేఘంలోకి పంపాం, సంరక్షక దుస్తులు ధరింపజేసి! ఆర్మీస్కౌట్ వెహికల్ యిచ్చి పంపాం. గంటక్రితం వాళ్ళనుండి రేడియో మెస్సేజిలు ఆగిపోయాయి."

"సో, యిటీజ్ అప్ టుయూ నా" అన్నాడు ప్రచండ సేన్.

"జంటిల్మెన్!" మధ్యలో కలుగజేసుకుంటూ వారి వద్దకు వచ్చాడు అశ్వత్థామ. "ప్రస్తుతానికి రాణా చేయగలిగిందేమీ లేదు. విషమేఘంపై ప్రభావాన్ని చూపిస్తుండటంచేత—కాల్షియం క్లోరైడ్ చల్లే కార్యక్రమాన్ని నిలుపుదల చేయడానికి వీలులేదు. రాణా ప్రస్తుతం ఆ దట్టమయిన కాల్షియంక్లోరైడ్ కాంసన్ట్రేషన్లో ప్రవేశించలేదు. దురదృష్టవశాత్తూ, యింకా అనుకున్నంత మేరకు విషమేఘాన్ని చెల్లాచెదురు చేయలేకపోయాం. కొద్దిసేపట్లో చీకటి పడబోతుంది. ఇది అతని లక్ష్యానికి మరీ అపాయకరం" అన్నాడు దృఢంగా.

"కానీ, వేలాదిమంది ప్రాణాలు పందెంలో పణంగా వున్నాయి."

"సరిగ్గా చెప్పావు. అందుకే రాణా అంత విలువయిన వ్యక్తి మనకు. అతని ప్రాణాలతో అనవసరమయిన స్కులు తీసుకోలేం — ముఖ్యంగా యిప్పుడు అక్కడ

'యిద్దరు పిచ్చివాళ్ళు' తిరుగుతున్నారని మనకు ఖచ్చితంగా తెలిసివుండీ కూడా."

"బట్ వుయ్ డోంట్ నో, దట్ ...."

"ఎస్. ఉయ్ డునో" అశ్వత్థామ కోపంగా అన్నాడు. "మీ ఒక్క తెలివితక్కువ తప్పిదం వల్ల ఆ యిద్దరు వలంటీర్లూ లోపలికి వెళ్ళడం జరిగింది మిస్టర్ ప్రచండసేన్. మీ ప్రతిపాదనకు వ్యతిరేకంగా నేను సలహా యిచ్చాను. బట్ యు డిడింట్ లిసన్! ఇప్పుడు రాణా తన జీవితాన్ని రిస్క్ తీసుకోడాన్ని నేను సహించను. మీ తప్పుడు జడ్జిమెంట్ కారణంగా.... మొత్తం ఆపరేషన్ కంతటికీ అతను యెంతో కీలకమైన వ్యక్తి."

"అలాగని అసమర్థుల్లా యేమీ చేయకుండా చేతులు ముడుచుకుని కూర్చోలేం," అన్నాడు రణధవే ఉద్రేకంగా.

"మనం ఇప్పుడు ఏమీ చేయబోవటంలేదు. సప్లయిస్ ఉన్నంతవరకూ, రాత్రి అంతా పొగమంచుమీద స్ప్రేయింగ్ కార్యక్రమం కొనసాగుతుంది. ఉదయానికల్లా చుట్టూ వున్న మేఘం కరిగిపోయి అసలైన మైక్రోప్లాస్మాను క్లియర్‌గా చూడగలుగుతాం, రక్షణగావున్న పొగమంచు మాయమైతే .... అవసరమయినప్పుడు పిలువబడతాడని చెబుతూ, ఈలోపుగా రాణాను నిద్రపోవడాన్కి ప్రయత్నించవలసిందిగా సలహాయిస్తున్నాను."

* * *

తెల్లవారుఝామునే, ఇన్‌స్పెక్టర్ రైనా యిచ్చిన ట్రీట్‌మెంటుకి నిద్రలేవక తప్పలేదు రాణాకి.

రాత్రంతా రాణా, శ్మశానం కోసం వెతుక్కుంటూ వెళ్ళే శవం ఊరేగింపులావున్న అధికారుల వాహనాల

హడావిడిని గమనిస్తూ—గంటల తరబడి గడిపాడు.

చివరిగా, ఎలాగో నిద్రలోకి జారుకోగలిగాడు.

మధ్యలో ఓసారి మాత్రం నిద్రాభంగమైంది. కేకలు వినబడినప్పుడు! కారణం....

ఇంతకుముందు విషమేఘంలో ప్రవేశించిన' యిద్దరు వలంటీర్ల 'మృతదేహాలు' దొరికాయి.

ఉన్మాదుల బారినుండి తమను తాము రక్షించుకోవడానికి ముందు జాగ్రత్తగా యివ్వబడ్డ తుపాకులతో, ఆ యిరువురు ఒకరినొకరు కాల్చుకొని చచ్చిపోయినట్లు తెలిసింది.

నిద్ర మళ్ళీ ఆవహించింది రాణాని, ఆ కల్లోలం కొంచం తగ్గిన వెంటనే.

ఇన్స్పెక్టర్ రైనా' మాటలు విని తత్తరపడ్డాడు రాణా. ఏమిటని మళ్ళీ అడిగాడు, మత్తు వదలగొట్టుకోడానికి కళ్లు రుద్దుకుంటూ—

"విషమేఘం వెళ్ళిపోయింది బ్రదర్" అన్నాడు రైనా ప్రతిమాట వత్తి పలుకుతూ.

"అది....మాయమయింది."

* * *

అంధకారం....

ఆరుబయలు ప్రదేశం....

సుబేదార్ సికిందర్ ఏడడుగుల ఎత్తులో, ఏటవాలుగా వున్న గట్టుదిగుతూ, బూటుకాలికి చెట్టువేరు అడ్డుపడడంతో, ముందుకి తూలిపడ్డాడు.

అతని చేతిలోని టార్చిలైట్ జారిపడి క్రిందకు దొర్లుకుంటూ పోయింది.

ఎదురుగా చీకట్లోంచి పకపకా నవ్వులు వినిపించాయి.

"చుప్ రహో సాలే! ఇధర్ ఆవ్!" అరిచాడు సికిందర్ కోపంగా, పడిపోయిన టార్చిలైట్ అందుకుంటూ.

టార్చిలైట్లు వెలిగిస్తూ యిద్దరు సిపాయిలు ముందుకు వచ్చారు, "మాఫ్ కర్నా సాబ్!" అన్నాడు గంభీరత నటిస్తూ పొడుగాటి సిపాయి సంగా.

"మిమ్మల్ని డ్యూటీలో వున్నప్పుడు తాగమని ఎవడు చెప్పాడ్రా?"

"ఫిర్ ఏక్ బార్, మాఫ్ కర్నా సాబ్! రెండురోజుల నుంచీ చేసే పనిలేదు. బోరుకొట్టి మందు దిగించాం!" అన్నాడు వినయంగా రెండో సిపాయి భోలా.

"నా మొత్తని తనాన్ని అలుసు తీసుకొని పిచ్చివేషాలేస్తున్నారు తాగుబోతు కొడకల్లారా. ఇంకోసారి డ్యూటీలో వున్నప్పుడు తాగి వాగేరంటే కాప్టెన్‌కి రిపోర్టు చేస్తాను. పదండి" హూంకరించాడు సికిందర్.

ముగ్గురూ నడవసాగారు....

"సుబేదార్ సాబ్! మనం ఇక్కడికి ఎందుకు వచ్చినట్లు? ఇక్కడేం లేదు రైలు పట్టాలుతప్ప" వ్యాఖ్యానించాడు సంగా.

"ఈ గ్రౌండ్స్‌లో ప్రతి అంగుళం వెతకమని ఆర్డర్స్" కఠినంగా అన్నాడు సికిందర్, తుప్పు పట్టిన రైలుపట్టాల మీద టార్చిలైటు కాంతి ఊపుతూ.

"అది ఈపాటికి ఎక్కడికో పోయి వుంటుంది. రెండు రోజుల్నుంచీ ఈ ప్రాంతాల్లో వెతుకుతున్నాం...." అన్నాడు భోలా నీరసంగా.

"విషమేఘం వెళ్ళిపోయిందని 'వాళ్ళు' అనుకుంటున్నారు. మనం ఇక్కడ వున్నది నిర్ధారణ చేయడానికి."

"వాళ్ళేదో చల్లారుకదా సాబ్? దానివల్ల పూర్తిగా

కరిగిపోయి వుంటుంది. హైనా?" అన్నాడు భోలా, ఒ త్తిడి చేస్తూ.

"చెప్పాను కదరా చిడియా. వాళ్ళు అలా అనుకుంటున్నారు. కాని అది విచిత్రంగా మాయమైంది. వాళ్ళు రోజంతా స్ప్రే చేస్తూనే వున్నారు. ఆ మందు చక్కగా పనిచేస్తుంది కూడా. కాని అకస్మాత్తుగా అది అక్కడ లేదు—విష మేఘం మధ్యభాగంలోని పదార్థం."

"ఆ మధ్యలో ఉన్నదేమిటి సాబ్? భయంకరమైన నల్లి కాదు కదా!"

"కాదు. మనిషిని పిచ్చివాడ్ని చేసే వ్యాధి. అది పూర్తిగా మాయమయిందని వాళ్ళకు నిర్ధారణకావాలి."

"బాప్ రే! అది మనకు ప్రమాదం కదా?" నోరెళ్ళబెట్టాడు సంగా.

"ఘబ్రావ్ మత్. మనం దానిలోకి ప్రవేశించనక్కర లేదు. అది కనబడగానే రిపోర్టు చేయాలి అంతే!"

భోలా ఆశ్చర్యంగా అడిగాడు. "సుబేదార్ సాబ్! ఇది యుద్ధం కాదుగదా? మనకు ఈ రైఫిళ్ళు యెందుకిచ్చారు?"

"పిచ్చివాళ్ళు దారికడ్డం బడితే—ఆత్మరక్షణ కోసం"

"ఈ అంధకారంలో పిచ్చివాళ్ళా? సుబేదార్ సాబ్! కొంచెంసేపు ఎక్కడయినా కూర్చుందాం. తిరిగి తిరిగి కాళ్ళు పీకుతున్నాయి" ఆక్రోశించాడు సంగా.

"నోర్మూసుకొని నావెంట రండి. కాప్టెన్ చూస్తే నన్ను చంపుతాడు."

రైలుపట్టాల మధ్యగా నడవసాగాడు సుబేదార్ సికిందర్ స్లీపర్స్‌మీద, టార్చిలైట్ కాంతివేస్తూ....

"అకస్మాత్తుగా యిప్పుడు రైలువస్తే మనమేమౌతాం

సాబ్?" భోలాకి అనుమానం వచ్చింది.

"త్రాగుబోతు ప్రేలాపన కట్టిపెట్టండి. ఈ రైల్వే లైను ఇప్పుడు ఉపయోగంలో లేదు. దీనిమీద మొలిచిన గడ్డినీ, తుప్పుపట్టిన రైలుపట్టాలను చూస్తే తెలియడం లేదూ?"

ముగ్గురూ ముందుకు నడుస్తున్నారు, పట్టాలకి యిటూ అటూ వున్న ఎత్తయిన గట్లమీద టార్చిలైట్ వేసి పరీక్షిస్తూ.

కొంతసేపయిం తర్వాత అడిగాడు సంగా "సికందర్ సాబ్! ఆ విషమేఘం మధ్యలో 'మెరుపు'కి కారణ మేమిటి?"

"నేను చెప్తాను" అందుకొన్నాడు భోలా, "ఏదో పుస్తకంలో చదివానుయార్! అణుధార్మిక....ఆఁ! రేడియేషన్ అయ్యుండాలి" అన్నాడు పొట్టిసిపాయి భోలా గర్వంగా.

"ఎవరు చెప్పారు అది 'రేడియేషన్' అని?" సికిందర్ ఆగి వెనక్కి తిరిగి వాళ్ళవైపు చూశాడు.

"అవకాశం వుంది, సాబ్!" భోలా కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి. "అది మెరుస్తోందని మన సైంటిస్టులు చెబుతున్నారు. దానికి మనిషి మెదడును చెదపట్టించే గుణం వుంది. అది రకరకాల ప్రదేశాలకు కొట్టుకపోతూ వుంటుంది. దాన్ని మనవాళ్ళు ఆపలేకపోతున్నారు. వీటి అన్నిటి ఆధారంగా నేను ఊహించాను."

"అలాగా! అయితే రేడియేషన్ సముద్రంలోంచి యెలా వస్తుందిరా కమీనే?"

"అలాంటి కట్టుకథలు నమ్మడానికి ప్రభుత్వం మామీద ఆధారపడుతుంది."

"నోరు సంబాళించుకోరా భోలా! మిలిట్రీ జైల్లోకి పోతావ్!"

"కోపగించకండి సాబ్! ఇక పదండి."

ముగ్గురూ ముందుకు నడవసాగారు.

వెనగ్గా నడుస్తున్న భోలా, తన తెలివితేటల్ని మళ్ళీ ఏకరువు పెట్టసాగాడు సంగాకు. "ఈపని సైంటిస్టులే చేసివుండాలి. ఏ తారాపూర్ అణుకేంద్రాలలోనో ప్రేలుడు జరిగివుండాలి. ఆ రహస్యాన్ని దాచడం కోసం ఈ కట్టుకథలు....ఏమంటావ్?"

"ఠీక్ హై ప్రొఫెసర్!" అన్నాడు సంగా ఉత్సాహంగా, "భావ్‌నగర్‌లో భూమి కంపించడానికి కారణం కూడా ఆటమిక్ ప్రేలుడు అయివుండాలి."

"బక్వాస్ బంద్ కరో—భోలా! మన ఎదురుగా పెద్ద టన్నెల్ వుంది" అన్నాడు యెదురుగా నల్లటి ఆకారం వైపు చూస్తూ సికిందర్.

"కాస్సేపు అక్కడ రెస్టు తీసుకుందాం!" అన్నాడు ఆత్రంగా సంగా.

"ఎప్పుడో నా తుపాకీతో మిమ్మల్నిద్దర్ని కాల్చి చంపుతాను సైతాన్‌కి బచ్చే!" అసహనంగా కేక పెట్టాడు సుబేదార్.

అర్ధచంద్రాకారంలో ఉంది సిమెంటు టన్నెల్ ఎత్తుగా.

లోపల గుహలా వుంది....

టన్నెల్ ముఖద్వారంలో సంగా, భోలా చతికిల బడ్డారు, దూరంగా చుట్టుపక్కల సెర్చింగ్ చేస్తున్న సైనికులకి కనబడకుండా.

సంగా అగ్గిపుల్ల వెలిగించి చెయ్యి అడ్డం పెట్టుకొంటూ

తన సిగరెట్ ముట్టించుకొని, భోలా సిగరెట్ వెలిగించాడు.

"ఓహ్ సారీ సుబేదార్ సాబ్" అన్నాడు సంగా, కంగారుగా మండే అగ్గిపుల్ల సికిందర్ వైపు చూపుతూ.

"నెవర్ మైండ్" అని సిగరెట్ తన అగ్గిపెట్టెతో ముట్టించుకున్నాడు సుబేదార్.

సంభాషణ మళ్ళీ రేడియేషన్ మీదకు మళ్ళింది ... యిక వారి ధోరణి భరించలేకపోయాడు సికిందర్. "మీరిక్కడే ఏడవండి. నేను లోపల చూసివస్తాను. తర్వాత వెనక్కిపోదాం" అన్నాడు విసుగ్గా.

"ఠీక్ హై సుబేదార్ సాబ్!" అన్నారిద్దరూ ముక్తకంఠంతో. సికిందర్ టార్చిలైట్‌తో, గుహలాంటి టన్నెల్‌లోకి ప్రవేశించాడు.

* * *

టన్నెల్ పొడవుకి విసుపోయాడు సికిందర్.

ఎంతసేపు నడిచినా దాని చివరిభాగం కనబడ్డంలేదు అతనికి. టార్చిలైట్ కాంతిలో చెమ్మగా రాతినేల కనబడులోంది. ఒకచోట ఆగి, వెనక్కి తిరిగి చూశాడు సుబేదార్.

ఇప్పుడు భోలా, సంగాల ఉనికిని తెలిపే టార్చిలైట్లు అతనికి కనబడటంలేదు.

బహుశా—తను టన్నెల్‌లో మలుపు తిరగడంవల్ల అనుకున్నాడు సికిందర్.

తను మలుపు మధ్య వుండి వుండాలి.

ముందు దారి, వెనుకదారి కనబడ్డంలేదు.

అకస్మాత్తుగా లఘుశంక తీర్చుకోవాల్సిన అవసరం

గుర్తుకొచ్చింది సికిందర్ కి.

రైఫిల్ గోడవారగా పెట్టి, టార్చిలైట్ చంకలో పెట్టుకొని పాంటు గుత్తాలు విప్పుకోసాగేడు సుబేదార్.

సరిగ్గా అప్పుడే....

తన కాళ్ళకు సన్నని తీగల్లా చుట్టుకుంటున్న పసుపు రంగు పొగను గమనించలేదు సికిందర్.

కొద్ది క్షణాల్లోనే ఆ పొగమంచు దట్టంగా మారి, మెల్లగా పైకిలేచింది, అతన్ని కప్పేస్తూ.

*   *   *

"సుబేదార్ వెళ్ళి చాలా సేపయింది" వ్యాఖ్యానించాడు సంగా, వేళ్ళు కాలుతున్నా, సిగరెట్ ఆఖరి దమ్మును లాగడానికి ప్రయత్నిస్తూ.

"అలా చేస్తే తొందర్లోనే కాన్సర్ తో చస్తావ్!" హెచ్చరించాడు భోలా. "సిగరెట్ ఆఖరి ముక్కలో నికోటిన్ ఎక్కువ వుంటుంది." భుజాలెగరేశాడు సంగా నిర్లక్ష్యంగా.

ప్రక్కకు తిరిగి, పొలికేక పెట్టాడు భోలా, "జల్దీ ఆవ్ సుబేదార్ సాబ్! క్యాకర్తె హోతుమ్...."

"సుబేదార్ 'ఈ' విషయాన్ని చాలా సీరియస్ గా తీసుకుంటున్నాడు కదూ?" అన్నాడు సంగా.

"కాప్టెన్ ప్రమోషన్ కోసం" చెప్పాడు భోలా.

"పొగమంచు సంగతేమిటంటావ్ భోలా?" అడిగాడు మళ్ళీ సంగా, ఒక్కో టాపిక్ మీదా భోలా నాలుగైదు, అభిప్రాయాలు చెప్పగలడని తెలిసి—

"నహీఁ మాలూమ్ యార్! వాతావరణ కాలుష్యం వల్ల కూడా యిలాంటి ప్రమాదం ఏర్పడొచ్చు. ఫ్యాక్టరీలు చెత్తనంతా నదుల్లో పారబోయడంవల్ల చేపలు చచ్చి

పోయి, తేలడంలాంటి సంఘటనలు పేపర్లలో చదివే వుంటావ్. ఈసారి ఏదో ఫ్యాక్టరీ, చైతన్యంతా ఆకాశంలో వదిలివుండాలి, గాస్ కాని, విషవాయువు కాని."

భోలా తన కొత్త షిరీని సవరించుకుంటుండగా— విష మేఘం గుహలోనుండి చీకట్లో ఎవరికీ కన్పించకుండా ఆయిద్దరివైపు పాక్కుంటూ రావడాన్ని ఎవరూ గమనించలేదు.

ఆ పొగలోంచి ఓ ఆకారం, రైఫిల్ ముందుకుసాచి వేగంగా వస్తోంది....

రెండు టార్చిల కాంతిలో కూర్చున్న యిద్దరివైపు, ఆ వ్యక్తి గబ-గబా నడుస్తున్నాడు.

అతని చంకలోని టార్చి, యింతకుముందు టన్నెల్ లోని రైలుపట్టాల మధ్యగా పడిపోయింది.

క్షణాల్లో అతను భోలా, సంగా వద్దకు చేరుకున్నాడు.

"కిధర్ గయే సాబ్? అభీతక్...."

ఆ ప్రశ్న వినబడలేదు అతనికి.

అతను నెమ్మదిగా రైఫిల్ పైకెత్తి, బారెల్ ని ఒకడి నుదుటికి ఆన్చాడు.

వెనువెంటనే ట్రిగర్ నొక్కాడు.

ఆ గుహలో 'ఢాం'....అంటూ ప్రేలిన రైఫిల్ శబ్దం 'రెండో' వ్యక్తి పొలికేక, పెద్దగా ధ్వనించాయి.

నిశ్చేష్టుడై, శిలాప్రతిమలా నిలబడిపోయాడు భోలా, పొగలు కక్కుతున్న రైఫిల్ కేసి చూస్తూ.

మరుక్షణం తేరుకుని, చీకట్లో గోడవారగా నిలబెట్టిన తన రైఫిల్ మర్చిపోయి గుహద్వారంనుండి బయటికి పరిగెత్తాడు భోలా, వెర్రిగా అర్చుకుంటూ.

ప్రాణ భయంతో, బిక్క చచ్చిపోతూ, పరిగెడుతూ, పది అడుగుల ఎత్తులో ఉన్న గట్టు ఎగబ్రాకసాగాడు. భోలా.

అదే అతను చేసిన పొరపాటు.

సగంమారం ఎక్కి, బూటుకాలు జారి, బరువుగా క్రిందికి జారిపోయాడు భోలా——

మోకాళ్ళమీద పడిఉన్న భోలా, ప్రక్కగా, గంభీరంగా నిల్చొని ఉన్న సికిందర్, చేతిలోని రైఫిల్ మడమ రివ్వున గాలిలోకి లేచింది....

గుహలోనుంచి విష మేఘం బయటికివచ్చి వారిద్దర్నీ కమ్మేసింది....

* * *

రాణా అప్పుడే కళ్ళు తెరిచి, సీలింగ్ వైపు తదేకంగా చూడసాగాడు. అతని మస్తిష్కం, తిరిగి మామూలుగా పని చేయడానికి కొన్ని క్షణాలు పట్టింది.

తర్వాత బెడ్ మీద, తన ప్రక్కగా పడుకున్న లూసీ వైపు తలతిప్పి చూసాడు.

కర్టెన గుండా ఉదయకాంతి ఫిల్టర్ అవుతూ, ఆమె ముఖంమీద పడి, ప్రశాంతంగా కనబడుతోంది.

భౌతికమైన గాయం మానుతుంది. కాని మనసులో లోతుగా నాటుకున్న గాయంనుండి ఆమె తిరిగి కోలుకో గలుగుతుందా?

డాక్టర్ జులేఖా, తనకి పూర్తి హామీని యిచ్చింది. తనలాగే ఆమె పూర్తిగా కోలుకొన్నదనీ, ప్రాణాంతరమైన ఆ వ్యాధి తిరిగి ప్రకోపించే అవకాశం ఎంతమాత్రం లేదనీ.

(ఇంకా వుంది)